క్లుప్తంగా

కూటమి పాలనలో పెచ్చరిల్లిన లైంగిక దాడులు



మాట్లాడుతున్న సంస్థ నాయకులు

పలమనేరు: వడమాలపేట మండలం యానాదికాలనీలో ముక్కు పచ్చలారని చిన్నారిపై లైంగికదాడి చేసి హత్య చేసిన మృగాడిని కఠినంగా శిక్షించాలని స్థానిక మానవహక్కుల సంస్థ సభ్యులు శివన్న, సుబ్రమణ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంస్థ కార్యాలయంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిన్నారులు, మహిళలపై ఇలాంటి ఘోరాలు పెచ్చరిల్లిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనల్లో రాజకీయ అండతోనే నిందితులు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మునిరత్నం, నాగార్జున పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

సదుం: రేషన్ దుకాణాలలో సరుకులను సకాలంలో లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్ ఆదేశించారు. కొన్నిచోట్ల సకాలంలో పంపిణీ చేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, అలా చేస్తే డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు చందం విద్యార్థులు



కుప్పం రూరల్: రాష్ట్రస్థాయిలో షూటింగ్ బాల్ పోటీలకు కుప్పం మండలం చందం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మురళి తెలిపారు. సోమవారం రామకుప్పం డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహించిన జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో చందం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులు జి. పవన్, ఎం. మోక్షిత్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరు ఈ నెల 9,10వ తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని మురళి చెప్పారు. వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు లోకనాథంను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.


సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్

బైరెడ్డిపల్లె: సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ కోరారు. సోమవారం బైరెడ్డిపల్లెలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. తాజా ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, విటమిన్ కలిగిన ఆహార పదార్థాలను బాగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రాజేశ్వరి, జయమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



నాగరాజును సన్మానిస్తున్న తపాలా సిబ్బంది

సదుం: ప్రతి ఉద్యోగికి వయసు రీత్యా విరమణ సర్వసాధారణమని పుంగనూరు పోస్టల్ డివిజన్ మెయిల్ ఓవర్సీస్ వెంకటరమణ అన్నారు. స్థానిక పోస్టాఫీస్‌లో రెడ్డివారిపల్లె అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ నాగరాజు ఉద్యోగ విరమణ పురస్కరించుకుని సోమవారం వీడ్కోలు సన్మానం చేశారు. ఆయన శేషజీవితం ప్రశాంతంగా ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. జీడీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి, పోస్టుమాస్టర్ మణి, సిబ్బంది, రెడ్డివారిపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్



పెద్దపంజాణి: మండలంలోని అమ్మరాజుపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పెద్దపంజాణి పీహెచ్‌సీ వైద్యాధికారి లిఖిత రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ లావణ్య, ఏఎన్ఎం హరిప్రియ, ఆశావర్కర్లు భారతి, రెడ్డెమ్మ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

పనిచేయని కియోస్క్‌లు

ఆర్బీకేలను నీరుగార్చిన ప్రభుత్వం

- రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చడానికే పరిమితం
- కియోస్క్‌ల డిజిటల్ ఆధారిత సేవలు కనుమరుగు
- నియోజకవర్గంలో రైతన్నలకు అందని సేవలు
- పట్టించుకోని వ్యవసాయశాఖ



మొరం ఆర్బీకేలో గత ప్రభుత్వంలో కియోస్క్ సేవలను ఉపయోగించుకున్న రైతులు(ఫైల్)

పలమనేరు: రైతు బాగుంటే రాజ్యం బాగుంటుందనే మాటను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతల్లో చూపెట్టింది. రైతులు ఉంటున్న గ్రామంలోనే ఆర్‌బీకే సేవలు తెచ్చి వారికో వరంలా మార్చింది. అప్పట్లో టీడీపీ పాలనలో రైతన్నలు ఎరువులు, విత్తనాలు ఇత్యాది వాటికోసం పడిన కష్టాలు పునరావృతం కాకుండా చేసింది. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందుల, నాణ్యమైన విత్తనాలు ఎమ్మార్పీకే రవాణా సమస్య లేకుండా రైతులకు స్థానికంగానే అందేలా చర్యలు తీసుకుంది. ప్రధానంగా రైతుభరోసా కేంద్రాల్లోని కియోస్క్‌ల సాయంతో సాంకేతికంగా రైతులను ముందుకు తీసుకెళ్లేలా చొరవచూపింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చినప్పటికీ సేవల కొనసాగింపులో వివక్ష చూపింది. వైఎస్సార్ సీపీ ముద్ర లేకుండా చేయడానికి ఆ సేవలకు స్వస్తి పలికింది. ఫలితంగా ఆర్బీకేల లక్ష్యాన్ని నీరుగారింది. రైతుసేవా కేంద్రాల్లోని కియోస్క్ సేవలు కొండెక్కాయి. పలమనేరు నియోజకవర్గంలో ఇప్పుడు ఎక్కడా ఇవి పనిచేయకపోవడం రైతాంగానికి శాపంగా పరిణమించింది.

గతంలో కియోస్క్ సేవలిలా...

ఆర్‌బీకేల్లోని డిజిటల్ ఆధారిత సేవల ద్వారా ఈ మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లు సాంకేతికంగా రైతుల అవసరాలకు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు, రైతుల పండించిన వ్యవసాయోత్పత్తులకు మార్కెట్ రేటు, సమీపంలోని మార్కెట్ల వివరాలు, అక్కడి ధరలు ఇందులో డిస్‌ప్లే అయ్యేవి. దీంతో రైతులకు ఖచ్చితమైన సమాచారం తెలిసేది. ముఖ్యంగా వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు ఏ సీజన్‌లో ఏ పంటలు సాగు చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చో సమాచారం ఇక్కడ లభించేది. నాడు రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న కియోస్క్ సేవలు కూటమి ప్రభుత్వ పాలనలో రైతాంగం దరికి చేరకుండా పోయాయి.

కూటమి రాకతో నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వ రాకతో ఆర్‌బీకేలపై నిర్లక్ష్యం పెరిగింది. ఇందులోని సేవలన్నీ మాయమయ్యాయి. సాంకేతిక కారణాలతో ఆయా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలు పనిచేయడం లేదు. లక్షల విలువైన ఈ యంత్రాలు ఇప్పుడు దిష్టిబొమ్మలుగా మారాయి. కొన్ని చోట్ల ఇవి బాగున్నా ఇంటర్‌నెట్ లేదంటూ ఆపేశారు. దీంతో కోట్లాదిరూపాయల ప్రజాధనం నిరుపయోగమైంది. కియోస్క్‌లున్నా రైతులకు మేలు చేయని పరిస్థితి కల్పించినట్లైంది. వీటిపై స్థానిక వ్యవసాయశాఖ అధికారులు సైతం అస్సలు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా వీటి సేవలను కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

పలమనేరు నియోజకవర్గ సమాచారం		
మొత్తం ఆర్‌బీకేలు	:	98
ఒక్కో ఆర్‌బీకేకు రూ.21.8లక్షల చొప్పున గత ప్రభుత్వం పెట్టిన ఖర్చు	:	రూ.21.71 కోట్లు
మొత్తం మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లు	:	98
ఆర్‌బీకేలతో సేవలను పొందుతున్న రైతులు	:	60వేలకు పైగా

కియోస్క్‌లతో ఎన్నో ఉపయోగాలు



రైతు సేవా కేంద్రాలు గత ప్రభుత్వంలో ఉన్నలాగా ఇప్పుడు లేవు. సెంటర్లలోని కియోస్క్‌లో రైతులకు అవసరమైన ఎన్నో సేవలు ఉండేవి. ఇప్పుడా సేవలేవీ లేవు. ఆ మెషిన్ పనిచేయడం లేదు. ఇప్పటికే ఉన్న మెషిన్‌ను రెడీ చేస్తే సరిపోతుంది. ఏదో ఓ సమయంలో రైతులు సెంటర్‌కు వెళ్లి దాంట్లో అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చు. -కల్లాడు సుబ్బన్న, పలమనేరు మండలం

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం



కొన్ని రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్‌లు సాంకేతిక సమస్యల కారణంగా పని చేయడం లేదు. ఆయా మండలాల్లో ఎన్ని పనిచేయడం లేదో తెలుసుకుని సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం. కానీ అక్కడి నుంచి ఇంకా స్పందన రాలేదు. దీనిపై మరోసారి కూడా అధికారులతో మాట్లాడుతాం. -సంధ్య, ఏఓ, పలమనేరు మండలం

కూటమి దౌర్జన్యకాండకు ప్రజా కోర్టులో శిక్ష

- పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ



పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేస్తున్న దౌర్జన్యాలు, దాడులు, అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో ప్రజాకోర్టులో వీరికి తగిన శిక్ష తప్పదని మాజీ ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ వ్యాఖ్యానించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, గంగవరం మండలంలోని ఎదువ వేమనపల్లెలో గుర్రప్ప పేరిట ఉన్న భూమిలో టీడీపీ నాయకులు తమ ఇంటికి సీసీ రోడ్డును వేసుకోవడంపై అభ్యంతం తెలిపితే వారిపై దాడులు చేయడం శోచనీయమని నిరసించారు. దీనిపై తమకు న్యాయం చేయాలని బాధితులు సంబంధిత అధికారులను కోరినా పట్టించుకోలేదని, దీంతో వారు కోర్టులో స్టే తెచ్చుకున్నప్పటికీ కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ టీడీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను ఖండిస్తున్నామన్నారు. కూటమి పాలనలో ముఖ్యంగా చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు సాగుతున్నా ప్రభుత్వంలో చలనం లేదని, దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సైతం బహిరంగంగా విమర్శించడం చూస్తే పాలన ఎంత అధ్వానంగా ఉందో తేటతెల్లమైందన్నారు.

న్యాయం చేయాలని వినతి

బైరెడ్డిపల్లె: తాతల కాలం నుంచి తాము సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలు పొందారని, తమకు న్యాయం చేయాలని సోమవారం తహసీల్దార్ మాధవరాజుకు తాతిరెడ్డిపల్లె గ్రామవాసి చంద్రశేఖర్ కుటుంబీకులు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, గ్రామ సమీపంలోని సర్వేనంబర్ 174/2లో 1.24 ఎకరాలు పూర్వీకుల కాలం నుంచి సాగు చేసుకుంటున్నామన్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేశారని, ఇది తెలుసుకొని కొంత కాలంగా అధికారులు చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పీహెచ్‌సీలో మీటింగ్ హాల్ నిర్మిస్తాం

- ఎంపీపీ భాస్కర్‌రెడ్డి



ఆస్పత్రి అవసరాలపై మెడికలాఫీసర్ సల్మాతో మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: మండలంలోని ముడిబాపనపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుబంధంగా సమావేశ మందిరాన్ని ఎంపీ మిథున్‌రెడ్డి నిధులతో నిర్మిస్తామని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. సోమవారం ఎంపీడీఓ లీలామాధవి, మెడికలాఫీసర్ డాక్టర్ సల్మాతో కలసి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు సమావేశ మందిరాన్ని ఎంపీ నిధులతో నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రి ఖాళీ స్థలం చాలా వరకు ఉందని, ఆ స్థలంలో రూ.15లక్షలతో నిర్మాణానికి ప్రతిపాదన చేస్తామన్నారు. ఇదలా ఉంచితే, సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో డాక్టర్లు, నర్సులు, సిబ్బంది ప్రతి గ్రామాన్నీ సందర్శించి, ప్రజలకు వైద్యసేవలు అందించాలని కోరారు. ఆయా ప్రాంతాలలో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని సచివాలయ అధికారులు, పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలకు సూచించామన్నారు. అవసరమైన ప్రాంతాలలో ఎంపీటీసీలు, సర్పంచులు, తనతో సహా పాల్గొంటామన్నారు. ఆసుపత్రిలో ఏవైనా సమస్యలుంటే ఎమ్మెల్యే ద్వారా పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో స్కిల్ సెన్సెస్ సర్వే

పెద్దపంజాణి: స్కిల్ డెవలప్‌మెంట్‌పై సచివాలయ ఉద్యోగులకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 15-59 సంవత్సరాలలోపు ఉన్న స్త్రీ పురుషుల నైపుణ్యాభివృద్ధి సంబంధించి సమగ్ర వివరాల సేకరణకు త్వరలో సర్వే చేస్తామని ఎంపీడీఓ బాలాజి తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి విద్య, వృత్తి వివరాలు, ఏ అంశంలో వారికి నైపుణ్యత, ఆసక్తి ఉందో సర్వేలో తెలియజేయాలని కోరారు. అలాగే, స్వయం సహాయక బృందాల సభ్యులలో నిరక్షరాస్యులైన వారిని గుర్తించి త్వరలో వారికి ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వయోజన విద్యా శిక్షణ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెలుగు ఏపీఎం మీరాబాయి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, పంచాయతీ విస్తరణాధికారి శారదాదేవి, రిసోర్స్ పర్సన్ హరిబాబు డీఏ జయచంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ సోమశేఖర్, వెలుగు సీసీ బాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు డీఏ, బకాయిలు ప్లీజ్!



సమావేశంలో మాట్లాడుతున్న గురురాజారావు

పుంగనూరు: పెన్షనర్లకు నూతన డీఏతో పాటు డీఏ బకాయిలు కూడా తక్షణమే చెల్లించాలని పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గురురాజారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పెన్షనర్ల భవనంలో అసోసియేషన్ అధ్యక్షుడు చెంగారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గురురాజారావు మాట్లాడుతూ, పెన్షనర్లకు పీఆర్‌సీ ప్రకటించాలని, తాత్కాలిక సహాయం ఇవ్వాలని , పెన్షన్ కమ్యుటేషన్‌లో రికవరీలు 12 ఏళ్లకే నిలిపివేయాలని, గతంలోలా 70 ఏళ్లకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, భరత్ భూషణ్, కేశవరెడ్డి, చంద్రశేఖర్, సిద్ధలింగం, సుబ్రమణ్యం, కరంతుల్లా, ద్వారకమ్మ, గంగులమ్మ, చలపతి, రమేష్, వరదరాజులు, నారాయణరెడ్డి, రామమూర్తి, లీలావతి, జగదాంబ, కృష్ణారెడ్డి, జయబాల, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయమేది చంద్రన్నా..!

పలమనేరు: తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వ మాట ఏమైందని..దీనికి సీఎం చంద్రబాబునాయుడే సమాధానం చెప్పాలని స్థానిక ఏపీ రైతు సంఘ నేత ఉమాపతినాయుడు డిమాండ్ చేశారు. ఇదే విషయమై సోమవారం ఆయన మండలంలోని పెంగరగుంట సచివాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో వర్షాలు లేక గత ఖరీఫ్‌లో వేరుశనగ పంట నష్టాలతో రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం పలమనేరును కరువు మండలంగా ప్రకటించిందని, కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఏనుగుల కట్టడికి చర్యలు తీసుకోరూ!

- డీఎఫ్ఓకు వినతి



డీఎఫ్ఓకు భరణికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘ నేత

పలమనేరు: పలమనేరు కౌండిన్య ప్రాంతంలోని గ్రామాల్లో గజదాడుల సమస్యపై చర్యలు తీసుకోవాలని చిత్తూరులో జిల్లా అటవీశాఖ అధికారిణి భరణికి ఏపీ రైతు సంఘ నాయకులు ఉమాపతినాయుడు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏనుగుల సమస్య పరిష్కారానికి కుంకీ ఏనుగులను తెస్తామని చెప్పారని, అయితే ఇంతవరకూ ఆ దిశగా ఏమీ చేయలేదన్నారు. ప్రతిరోజూ రోజూ ఏదో ఒక గ్రామంలో ఏనుగుల పంటలపై దాడులు చేస్తూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం మూడు రాష్ట్రాల పరిధిలో ఎలిఫెంట్ కారిడార్ నిర్మాణానికి పూనుకోవాలని డీఎఫ్ఓకు విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి 'ఉపాధి' సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వీ.కోట: నేమహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వివిధ శాఖల ఆధ్వర్యంలో చేసిన పనులపై మంగళవారం నుంచి సామాజిక తనిఖీ చేయనున్నట్లు ఏపీఓ అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల ఉపాధి, సామానిక తనిఖీ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించి అధికారులు మాట్లాడారు.2023-24లో చేసిన ఉపాధి పనులపై గ్రామ పంచాయతీల్లో తనిఖీ చేస్తామని, దీనికి రైతులు కూలీలు, మేట్లు, ప్రజాప్రతినిధులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సహకరించాలని కోరారు. మండల కంప్యూటర్ కార్యాలయం ద్వారా 2,528 పనులు, పంచాయతీ శాఖ ద్వారా 47 పనులు, సర్వశిక్ష అభియాన్ ద్వారా 3, హౌసింగ్ శాఖ ద్వారా 22 పనులు చేశారని, వీటిపై సామాజిక తనిఖీ చేయనున్నట్టు చెప్పారు.

ట్రేడ్ లైసెన్సులు పొందకపోతే సీజ్ చేస్తాం

- కమిషనర్ మధుసూదన్‌రెడ్డి



పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో వివిధ వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు పొందాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటి పరిధిలో 1,558 మంది ట్రేడ్ లైసెన్సుదారులు ఉన్నారని, ఇంకనూ సుమారు 200 మంది ట్రేడ్ వ్యాపారస్తులు ఉన్నట్లు పరిశీలనలో తేలిందన్నారు. అలాగే గతంలో ట్రేడ్ లైసెన్సులు పొందిన వారు ఎక్కువ మంది రెన్యూవల్ చేసుకోలేదని, ప్రతిఏటా విధిగా తగిన రుసుం చెల్లించి, రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ఈ విషయంలో వ్యాపారస్తులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయల పరిధిలోని వ్యాపార కేంద్రాలను గుర్తించి, రిజిస్టర్‌లో నమోదు చేయాలని సచివాలయ కార్యదర్శులను ఆదేశించినట్లు చెప్పారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు చెల్లించకపోతే ఆ వ్యాపార కేంద్రాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఆగిపోయిన ఆర్టీసీ బస్సు



పెద్దగొట్టిగల్లు వద్ద నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

రొంపిచెర్ల: తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిలోని రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లు వద్ద అన్నమయ్య జిల్లా రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం మధ్యాహ్నం ఆగిపోయింది. సుమారు 50 మంది ప్రయాణికులతో తిరుపతి నుంచి పీలేరు, రాయచోటికి బస్సు బయలుదేరగా పెద్దగొట్టిగల్లు వద్దకు రాగానే ఆగిపోయింది. దీంతో బస్సులోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇటీవల కాలంలో పదే పదే ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో వెళ్తూ ఆగిపోతున్నాయి. మరమ్మతులకు గురైనప్పుడు నామమాత్రంగా చేసి పంపుతున్నారు. ఆర్టీసీ బస్సులకు 15 ఏళ్లు పూర్తయినా, లేదంటే 12 లక్షల కిలోమీటర్ల దూరం తిరిగిన బస్సును పక్కన పెట్టాల్సిందే. అయితే అధికారులు పాత బస్సులనే తిప్పుతుండడంతో ఎక్కడపడితే అక్కడ నిలిచిపోతున్నాయి. మెకానిక్‌లు ఎంత ప్రయత్నించినా రిపేరీ కాకపోవడంతో ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులను ఇతర బస్సుల్లో పంపించారు.

ఆరనీకు మా.. ఈ దీపం కార్తీక దీపం

- భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు



చౌడేపల్లె: దీపారాధన చేస్తున్న భక్తులు



కుప్పం: ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలగిస్తున్న మహిళలు

పుంగనూరు: పరమేశ్వరునికి అత్యంత ఇష్టమైన మాసం ఈ కార్తీక మాసం. ఈ మాసంలో వచ్చే సోమవారాల్లో భక్తులు అత్యంత పవిత్రంగా భావించి స్వామి వారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేయడం పరిపాటి. సోమవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని పలు శివాలయాలలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శ్రీ భోగనంజుండేశ్వరస్వామి ఆలయం, శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, నగిరివీధిలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పూజలు చేసి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉపవాస దీక్షలతో శివ నామస్మరణ చేశారు.

చౌడేపల్లె: కార్తీక మాసపు తొలి సోమవారం పురస్కరించుకొని స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులతోపాటు శివలింగానికి ప్రత్యేక పూజలు చేసి, సుందరంగా ముస్తాబు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరైన మహిళలు కార్తీక దీపారాధన చేసి ప్రదక్షిణలు చేశారు.

సదుం: స్థానిక మరకతేశ్వరస్వామి, వీరభద్రస్వామి, జాండ్రపేట అరుణాచలేశ్వరస్వామి, మత్తుకువారిపల్లె మల్లీశ్వరస్వామి ఆలయాలలో పూజలు చేశారు. కేదారేశ్వరస్వామి వ్రతమాచరించారు.

కుప్పం: పట్టణంలోని సోమేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు మహిళలు శివ నామస్మరణతో స్వామి వారికి నేతి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. కార్తీక దీపాలు వెలిగించడంతో ఆలయ ప్రాంగణం నూతన కాంతులతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

రామకుప్పం: కార్తీక మాసం సందర్భంగా స్థానిక శ్రీ అన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, విశేష పూజలు చేశారు. సాయంత్రం మహిళలు ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

వి.కోట: సోమవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలో ఈశ్వర్‌నగర్‌లోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, దాసార్లపల్లెలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించి, రకరకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు స్వామి వారికి దీపారాధన చేసి 350 వత్తులు వేసి, పిండిదీపాలను వెలిగించి, మొక్కులు చెల్లించారు.









పుంగనూరు: సోమేశ్వరస్వామి ఆలయంలో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు, రామకుప్పం: ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరుడు, వీ.కోట: ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ప్రజా సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో చిత్తూరు ఎంపీ, ఎమ్మెల్సీ

రామకుప్పం: మండలంలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ సుబ్రమణ్యం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్సీ మాట్లాడారు. సంక్షేమ పథకాలు, వ్యవసాయ పరికరాలను స్థానిక ప్రజాప్రతినిధులు, నేతల సమక్షంలో లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ లక్ష్మీకాంత్, సర్పంచులు విజలాపురం బాబురెడ్డి, రాజ్‌గోపాల్, సుబ్రమణ్యం, ఉషారాణి, మండల కో-ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

సదుం: మండలంలోని మామిడి, టమాట రైతులకు మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు హార్టికల్చర్ అధికారి సంతోషికుమారి తెలిపారు. జిల్లా అధికారులు, శాస్త్రవేత్తలు హాజరై పంటల సాగు, అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తారన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.